## ఒ. కె. దెన్

నిత్యమూ నడుస్తూవున్నరస్తాయే,
నిత్యం చూస్తూన్న మెట్లే—

అయితేం ఆ నిమేష మప్పుడు అంత చైతన్య మెట్లా కలిగిందా ఆ తావుకు అని అనుకొంటూ నా ద్రుక్కుగ్ధాన్ని తఱచి చూచాను. నవనీతంలాంటి యువతి. వేణుగోపాలమూర్తి వంటి యువకుడు. అమృతమథన మప్పుడు కష్టపడ్డవాళ్లకూడా స్వాధీనంకాక నాకు స్వాధీనపడ్డట్టు సాక్షాత్కరించి వూరుకున్నారు. అనుకొన్నాను వాళ్ళ యిద్దఱిచేత హైరోడ్డుమీద నేదో ఆట ఆడించాలని. చూడ్డంలో అందమూ వుంది ఆనందమూ వుంది ఆ యిద్దఱిలోను. అందులోనూ వారు పరస్పరం కలుసుకోవడంలో వారి మధ్య అందీ అందని ముద్దూ వుంది, చిక్కచిక్కని మురిపెమూ వుంది. ఆ ప్రాంతాన్ని ఆలాంటి సన్నివేశంలో కనబడేవాండ్రు మెడికల్‌కాలేజీ స్టూడెంట్సు తప్ప మఱెవ్వరూకారు అనేది రూఢి.

అది ఏ ముద్దుగుమ్మకైనా సరే అలా సునాయాసంగా దిగతగ్గ ఏటువాలు వాటంవున్న రోడ్డు. ఆ రోడ్డే ఏ యువకరత్నమైనా సరే బలే పట్టుదలతో మీదికి పోతగ్గ ఎదురెత్తు కలదికూడాను. ఇంకా ఫోటో తీసినట్టు, వెండి తెరమీద వేసినట్టు వర్ణించమంటారా ? అప్పుడే వెయ్యి న్నొక్క పాఠకునికళ్ళూ ఆ దిక్కుకు చూస్తూవున్నట్టున్నాయి ! అతిశయోక్తి యేమీ వ్రాయను. మాటలకు లోభించను. చూసేవుంటారు మీలో చాలామంది.

ఆ రోడ్డుకు సరసనే మరో రోడ్డు వుంది. ఈ రెండో రోడ్డు మట్టం మొదటి దానికన్న ఎత్తు. అంచేత దీనిమీదినుంచి దానిమీదికి చేరుకోవాలీ అంటే మేడమెట్లలా మెట్లువున్నాయి. ఈ మెట్లమ్మటే పైకెక్కితే పైరోడ్డునంటి మేడలూ మేన్షన్లూ వున్నాయి. మళ్ళా ఆ రోడ్డునే ఏటవాలుగా దిగితే క్రింది రోడ్డు మీదికే వస్తాం! మెట్లకూ మేన్షన్లకూ ఎట్ట యెదురుగా 'వే ఇన్' 'వే అవుట్' 'వే'లు రెండింటికీ మధ్య మెయిన్ వే. దేనివి?— కింగ్ జార్జి హస్పిటాల్, విశాఖపట్నానివి—!

చూచారా ఎక్కడ కొచ్చామో? మనవూరు—మనరోడ్డు—మన హాస్పటాలు—ఆ రోడ్డు పుచ్చుకుని ఓ వెంపుకు వెడితే మహాసముద్రం. మరో వెంపుకు వెడితే ఇంటీరియర్! ఇన్లాండ్! ఎక్కడకూ వెళ్ళదలచుకోకుండా అక్కడి కక్కడే ఏర్పాటుగా చూడాలీ అంటే అనతి దూరంలో ఓ మఱ్ఱిచెట్టు, మఱ్ఱిచెట్టుక్రింద వో పెట్టిబండీ కనబడకమానవు. మీరు ఎప్పుడైనా చూచారో లేదో నేను వానిని లక్షసారులు చూచాను. ఈకధ కవికి ఉపకరించవుగాని మరో కధకు గొప్ప బాక్‌గ్రౌండ్ అని నా నమ్మకం!

"ప్రతాప్!" అంది యువతి. యువకరత్నం 'హాలో!' నీవు సాయంకాలం సంగీతపోటీలో ఒక అభ్యర్థివేనూ? కాని యువతి 'ష్యూర్లీ!' ప్రతాప్ 'ఐ ఏమ్ సో గ్లాడూ' అంటూ డెర్బీషూస్ మీదవున్నవాడల్లా రబ్బర్‌షూస్‌మీద? లంఘించినట్టు ఒక్క ఎగురు ఎగిరి ఆలా ఎడంకాలు ముందుకాన్చి కుడికాలు వెనక్కు ఎత్తుతూ—తిరుగుడు చక్రం వెనకాల పరుగెత్తే పిల్లడిలా పరుగెత్తుతూ పైని వివరించిన మెట్లమ్మటే మధ్య మెట్లు రెండేసిగా విడిచి అమాంతంగా ప్రక్కరోడ్డుమీద ఇంకా

అసోనుతోనే కొంబడజొచ్చాడు. యువతి 'ప్రతాప్! ఇలా రావోయి! మాట!' అంది. ఆ మాటకు ప్రతాప్ కంపస్ ముల్లులా వెనక్కి తిరిగి, మెట్లమ్మట కాకుండా తిన్నగా దిగుతలతన్నే పరుగెత్తుకుంటూ రెండురోడ్ల అఖండప్పులపులోగాని ఆగలేదు. అప్పటికప్పుడే యువతి ఆ ప్రాంతానికే తానున్న రోడ్డుయొక్క ఏటవాలునే దిగికొంటూ 'ప్రతాప్! ఆ మెట్లు అన్నీ ఎందుకట్టారో తెలుసునా? ఒకదాని మీదనుంచి ఒకదాని మీదుగా పైకిపోవాలని కాదూ? రెండేసి రెండేసిగా దాటెయ్యవచ్చా ఆలా?' అని అడిగింది. 'ఈ సూత్రం గనుక ఈ సాయంత్రం వీణ పోటీలో నీవు అనుసరిస్తివా 'సరిగమ పదనిస' 'సనిదప మగరిస' 'సరిగమ పదనిస' 'సనిదప మగరిస' అంటూ మళ్ళీ అలాగ్గానే మెట్లు రెండేసో—ఈ పర్యాయం మూడేసోకూడా వదలిపెట్టుకుంటూ మిన్ను ముట్టాడు.

యువతి ఆ యువక మహాశయునియొక్క మిన్నందటం గమనిస్తూ 'ఒ. కె. డెన్' అనుకుంది. సాయంత్రం ఆమె వీణె మెట్లెన్ని విడిచిపెట్టి 'ప్రయిజుకొట్టిందో' ఒక్క ప్రతాప్కే ఎఱుక!